కృష్ణా డెల్టాలో సాగు నీటి ఎద్దడి

- నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు
- అక్కరకు రాని పట్టిసీమ ఎత్తిపోతల పథకం

పెదపాడు: కృష్ణా డెల్టాకు సాగునీరు సక్రమంగా అందక రైతాంగం సమస్యలు ఎదుర్కొంటున్నారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు దెందులూరు, ఏలూరు రూరల్ గ్రామాల రైతులకు కృష్ణా కెనాల్ ప్రధానాధారం. నియోజకవర్గంలో కృష్ణా డెల్టాలో దెందులూరు నియోజకవర్గంలో 50,400 ఎకరాలు వరిసాగు చేస్తున్నారు. పెదపాడు మండలంలో 17,500 ఎకరాలు, దెందులూరు మండలంలో 17,280 ఎకరాలు, పెదవేగిలో 7,500, ఏలూరులో 8,120 ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో వర్షపాతం తగ్గడంతో కృష్ణా కెనాల్‌లో నీరు అందుబాటులో లేకపోవడంతో నాట్లు ఆలస్యమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా దమ్ములు చేస్తున్నారు. వంతులు వారీగా తమ పంటలకు నీటిని సమకూర్చుతున్నారు. అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి అన్నట్లుగా అవసరానికి మించి ఇటీవల వర్షాలు కురిసాయి. అసలు వర్షాలే కురవని పరిస్థితి ఒక్కోసారి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల రాజుపేట గ్రామంలో నీరు అందక నారుమడులు ఎండుతున్నాయని ఏపీ కౌలు రైతుల సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. సత్యవోలు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఇటీవల ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ వద్దకు వెళ్లి సాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదని నీటిని విడుదలకు కృషి చేయాలని విన్నవించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదలవుతున్నా నేరుగా కృష్ణా నదిలోకి వెళ్లి కేఈ కెనాల్ ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు సరఫరా అవుతోంది. గోదావరి నీటిమట్టం 14 మీటర్లు కంటే ఎక్కువ ఉన్నప్పుడు మాత్రమే లిఫ్ట్ చేయడం సాధ్యమని అంతకంటే తక్కువగా ఉంటే పట్టిసీమ ద్వారా నీరు లిఫ్ట్‌చేయడం సాధ్యం కాదని ఇరిగేషన్ శాఖాధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల అవుతోందని అధికారులు చెబుతున్నారు. సాగు నీటికి ఎటువంటి ఆటంకం రాకపోవచ్చని వారంటున్నారు.


కేఈ కెనాల్‌లో అంతంతమాత్రంగానే నీటి ప్రవాహం


ఎండుతున్న నారుమడులను పరిశీలిస్తున్న రైతులు

కృష్ణాడెల్టాలో వరి సాగుకు

పట్టిసీమ నీరు రామిలేరు ద్వారా సరఫరా చేస్తే నియోజకవర్గ ప్రజలకు సాగునీరు సక్రమంగా అందే అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సాగునీటికి రైతులు ఇబ్బంది పడుతున్న సమయంలో రామిలేరు ద్వారా కేఈ కెనాల్‌కు సాగునీటిని అందించారు.

సాగునీరు అందించాలి



కృష్ణా డెల్టాలో శివారు భూములకు సాగునీరు అందడంలేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా సాగు నీరు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. కేఈ కెనాల్ ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందించి అన్నదాతలను ఆదుకోవాలి.

– కే శ్రీనివాస్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

1,400 క్యూసెక్కుల నీరు విడుదల

కేఈ కెనాల్ ద్వారా గురువారం వరకు 1,100 క్యూసెక్కులు విడుదల చేశాం. శుక్రవారం నుంచి 1,400 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నాం. లో లెవెల్‌లోని తూములకు నీటి ప్రవాహం సక్రమంగానే ఉంది. మెరక తూములకు నీరు పారకపోవడంతో కొంత ఇబ్బంది ఉంది. నీటి లభ్యతను అనుసరించి రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సూర్యతేజ, అసిస్టెంట్ ఇంజనీర్, పెరికీడు సెక్షన్

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండేరు వాగు


గుండేరు వాగులో ప్రమాదకర ప్రయాణం

దెందులూరు: దెందులూరు సైఫన్ వద్ద గుండేరు వాగు రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం రక్షణగా వేసిన ఇసుక బస్తాలు సైతం కొట్టుకుపోయి అలుగులగూడెం నుంచి దెందులూరు వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఈ వాగు ప్రవాహంలో ఓ మహిళ కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయింది. స్థానిక అధికారులు, జిల్లా అధికారులు వాగు వద్ద రక్షణ చర్యలపై స్పందించకపోవడంతో అలుగులగూడెం, దెందులూరు, సానిగూడెం, ఇతర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సైఫన్ వద్ద రక్షణగా వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోయిన దృశ్యం

క్లుప్తంగా

వందేభారత్ ఏలూరు హాల్ట్‌పై హర్షం

దెందులూరు: ఏలూరు రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వడంపై బీజేపీ నాయకులు దిడ్ల ఎంజీలో, రైల్వేబోర్డు మెంబర్ గుమ్మడి చైతన్యకృష్ణ, బుజ్జి గోపాల్, మోహన్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ వినతి మేరకు రైల్వే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవేంద్రకుమార్ హామీ ఇవ్వడంపై వారంతా హర్షం వ్యక్తం చేశారు.

సుప్రీం కోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలి

భీమడోలు: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని, మాలమాదిగలకు తగు న్యాయం చేయాలని కోరుతూ భీమడోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద మాలల సంఘం జిల్లా అధ్యక్షుడు గోగులమూడి రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మాలల సంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ షంషూద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ఎస్సీలంతా ఒకటేనని, వారిని వర్గీకరించే అధికారం కోర్టులకు లేవని చెబుతుందన్నారు. మందా కృష్ణ మాదిగ కోరికతో ఎస్సీ వర్గీకరణ చేయాలని, మాదిగలకు న్యాయం చేయాలని దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర సీఎం నారాచంద్రనాయుడు మాలమాదిగలను విడదీసి వారి రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాలలకు అన్యాయం చేసే విధంగా ఉన్న ఈ తీర్పును ఉపసంహరించేలా ప్రజాస్వామ్యవాదులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. త్వరలో ఉద్యమ కార్యాచరణను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాలల సంఘాల ప్రతినిధులు రమణ, బెంజిమన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని పర్యటన


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు: ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం చేస్తామని, గ్రామీణుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం రామశింగవరం, కూచింపూడి, న్యాయంపల్లిలో అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సభలు నిర్వహించారు.

మహిళా కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ఏలూరు (టూటౌన్): మహిళా కుట్టు శిక్షణా కేంద్రాన్ని స్థానిక గన్‌బజార్‌లో దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు, వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు మహిళా కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, పలువురు దళిత సేన మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ జెండాల తయారీ ప్రారంభం


జాతీయ జెండాలను తయారు చేస్తున్న ఘంటసాల స్వర పీఠం సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతికి గర్వకారణమైన జాతీయ జెండాకు క్రయవిక్రయాలు ఉండకూడదనే నినాదంతో నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపకుడు ఎస్ఎం సుభాని ఆగష్టు 15వ తేదీకి పాఠశాలలకు జెండాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు జెండాల తయారీని శుక్రవారం ప్రారంభించారు. మువ్వన్నెల జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 148వ జయంతిని ఏలూరు ఘంటసాల స్వర పీఠం ఆధ్వర్యంలో స్థానిక న్యూ అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత కేంద్ర నియంత్రణ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఇన్నర్ వీల్ క్లబ్, మానవత సంస్థల సాయంతో ఏర్పాటుచేసిన కుట్టు మెషీన్లను ప్రారంభించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పని పాట అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆసక్తి గల వారికి దేశభక్తి గేయాలు నేర్పిస్తున్నట్టు సుభాని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసిన పశ్చిమగోదావరి జిల్లా మానవత అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, ఆర్మీలో పని చేసిన బీడీ నాగేశ్వరరావులను సత్కరించారు. వీరికి దేవరకొండ వెంకటేశ్వర్లు భారత రాజ్యాంగ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో వై.అర్జున రావు, శ్రీహరి కోటి, అడుసుమిల్లి నిర్మల, కొమ్మోజు శ్రీనివాస రావు పాల్గొన్నారు.

అమ్మవార్లకు వైభవంగా ఆషాఢ సారె సమర్పణ

ఉంగుటూరు: భద్రకాళీ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించే కార్యక్రమం ఉంగుటూరులో భారీగా నిర్వహించారు. భద్రకాళీ అమ్మవారితో పాటు గ్రామదేవత చల్లాలమ్మ, కొండాలమ్మ, చిన్న చల్లాలమ్మ, జువ్వాలమ్మ అమ్మవారికి సారె సమర్పించే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు పలు రకాల స్వీట్లు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు. బాణ సంచా కాలుస్తూ, బ్యాండు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం కమ్మ వారి సేవా సమితి, భద్రకాళీ సేవాదళం ఆధ్వర్యంలో సారె సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గ్రామ పెద్ద కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, భీమేశ్వర స్వామి ఆలయ ఈవో శ్రీనివాసరావు, డాక్టరు కొండ్రెడ్డి శశికుమార్, గొడితి వెంకటేశ్వరరావు, కడియాల పరుశరామ్, అడపా శోభారాణి పాల్గొన్నారు. చేబ్రోలు ఆలయంలో గాయత్రిదేవికి మహిళలు సారె సమర్పించారు.


ఉంగుటూరు భద్రకాళీ అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

జాతీయ జెండా రూపకర్త పింగళికి ఘన నివాళులు

దెందులూరు: స్వాతంత్య్ర దినోత్సవ వారోత్సవాలను జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి సందర్భంగా దెందులూరు డీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూక రాజు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. తొలుత నర్సింగ్ కళాశాల నుంచి సీనియర్, జూనియర్ విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకుని ఊరేగింపుగా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయంవద్ద ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఆకునూరి ప్రియదర్శిని, ఎంపీడీఓ వీ. శ్రీలత, ఏఓ భీమరాజు, పోలీస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శి చౌదరిని జాతీయ పతాకాలతో కరస్పాండెంట్ నూకరాజు, విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీ.శ్రీలత మాట్లాడుతూ భారతజాతి కీర్తిని ఇనుమడింప చేసే విధంగా జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య 148వ జయంతిని నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. కృష్ణా జిల్లాలోని పింగళి వెంకయ్య గ్రామానికి చెందిన వీఎస్ చౌదరి మాట్లాడుతూ జాతీయ జెండా రూపకర్త ఇంటి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.


దెందులూరులో ఇన్‌ఛార్జి తహసీల్దార్ ప్రియదర్శిని, ఎంపీడీఓ శ్రీలత, ఏఓను సత్కరిస్తున్న దృశ్యం

బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి

ఏలూరు (టూటౌన్): ఏలూరు బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఏపీపీలు, న్యాయవాదులు ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన పీడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్‌ను శుక్రవారం ఆయన ఆఫీసులో గవర్నమెంటు ప్లీడరు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు కలిపి శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలం జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశేషమైన సేవలు అందించిన దివంగత కోనే రామ్మోహనరావు తనయుడు సీతారామ్ ఏలూరు బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సీతారామ్‌ను కలిసిన వారిలో జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ) బి.జగన్నాధరెడ్డి పాల్గొన్నారు.


కోనే సీతారామ్‌ను అభినందిస్తున్న జీపీ, ఏపీపీలు

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

గణపవరం: తల్లిపాలు బిడ్డకు జీవితాంతం రక్షణగా ఉంటాయని, తల్లిపాలు బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శుక్రవారం గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని సరిపల్లె సచివాలయం వద్ద ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు అవగాహన కల్పించారు. పిప్పర పీహెచ్‌సీ సీహెచ్‌వో వెకంటేశ్వర్లు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, హెచ్‌వీ సీహెచ్ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని, తులసి పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు వెంటనే అందించాలి

పెదపాడు: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు అందించడంతో పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని పెదపాడు సీడీపీవో కె విజయలక్ష్మి తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా వేంపాడులో వట్లూరు సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, అలా పట్టించడం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పిల్లల్లో కలుగుతుందన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని 100రోజుల కార్యాచరణను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రంలో సేవల లభ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారా లీగల్ సలహాదారు ఐ కృష్ణవేణి, సర్పంచ్ మరీదు రెడ్డియ్య, సూపర్‌వైజర్ కే కుమారి ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


పోలసానిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల సిబ్బంది, లబ్ధిదారులు


పిప్పరలో మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలి

భీమడోలు: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు ఐసీడీఎస్ పీవో కేవీ విజయలక్ష్మీ అన్నారు. మండలంలోని పోలసానిపల్లి, కురెళ్లగూడెం, వడ్లపట్ల, గుండుగొలను తదితర గ్రామాల్లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు, వెయ్యి రోజుల ప్రణాళిక కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ, ప్రదర్శన చేశారు. పోలసానిపల్లి బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కిషోర్‌బాలికలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సూపర్‌వైజర్ షాహనాజ్ బేగం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీవో కేవీ విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మ పాలు బిడ్డకు శ్రీరామ రక్ష అన్నారు. పుట్టిన గంటలోనే తల్లి ఇచ్చే ముర్రు పాలు బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. తల్లీ బిడ్డ ఆరోగ్య సంరక్షణ ఈ పాలవల్లే సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నూర్జహాన్, కవిత, ఎంఎల్‌హెచ్‌పీ రాణికుమారి, ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీకుమారి, బోడ రాజమణి, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీల్లో ఉప కులాలకు తగిన న్యాయం

భీమడోలు: సుప్రీం కోర్టు తీర్పు ద్వారా 30 ఏళ్లుగా మాదిగలు పడుతున్న కష్టానికి న్యాయం జరిగిందని బాబూజగ్జీవన్‌రామ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు భీమడోలు రామకృష్ణ అన్నారు. పోలసానిపల్లిలో శుక్రవారం రాష్ట్ర యువసేన ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబూజగ్జీవనరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ తీర్పు ద్వారా ఎస్సీల్లో ఉపకులాలకు తగిన న్యాయం జరుగుతుందని, విద్య, రాజకీయ, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఉపకులాలకు తగిన ప్రాధాన్యత కలిగి ఆ వర్గాలంతా అన్ని రంగాల్లో రాణించేందుకు, అభ్యున్నతి సాధించేందుకు అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు మందాకృష్ణ మాదిగ చేసిన కృషి భావితరాలకు ఆదర్శకంగా నిలుస్తుందన్నారు. నాయకులు ఉండి రాంబాబు, ఉండి పెద్దిరాజు, భీమడోలు రాము, పెనుమాక కొండ, జి.పెంటయ్య, ఉండి వెంకట రమణ, భీమడోలు మురళీ, ఉండి శివాజీ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం

దెందులూరు: సుప్రీం కోర్టు తీర్పు ద్వారా 30 ఏళ్ల ఎంఆర్‌పీఎస్ ఉద్యమానికి మాదిగల సామాజిక వర్గానికి న్యాయం జరిగిందని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి స్టాలిన్, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం నడిపల్లి ఎస్సీ కాలనీలో సంఘ నేతలతో కలిసి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రహదారులు ఛిద్రం.. ప్రయాణానికి అవస్థ

- భారీ వర్షాలకు రోడ్లు గోతులమయం
- మరమ్మతులు చేయాలంటున్న ప్రయాణికులు

భీమడోలు: మండలంలోని ప్రధాన రహదారులు వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. గ్రామీణ రోడ్లపై చినుకు పడితే చిత్తడి చిత్తడిగా మారి నడకే కష్టంగా మారిన పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. ప్రజలు ఎక్కువగా సంచరించే రహదారులను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షాలతో ప్రధాన రోడ్లన్నీ ఛిద్రంగా మారడంతో అటుగా ప్రయాణించాలంటేనే వాహనదారులు, చోదకులు హడలిపోతున్నారు. గుండుగొలను, భీమడోలు, భోగాపురం, కోరుకల్లు తదితర గ్రామాల్లోని రోడ్లలపై పెద్ద గోతులు ఏర్పడి నడవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాటిపై వాహనదారులు రాకపోకలు సాగించే తరుణంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహన చోదకులు గాయాలపాలైవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోవడంతో వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు రోడ్డు మరమ్మతులు, భీమడోలు రాజుల వీధి రోడ్డు, గుండుగొలను నుంచి భోగాపురం, గుండుగొలను నుంచి కోరుకల్లు రోడ్లు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వల్ల పనులు చేపట్టని పరిస్థితి నెలకొంది. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు రహదారిపై గోతులను దాతలు పూడ్చుతున్న కొన్ని రోజులకే యథాస్థితికి చేరుతుంది. భీమడోలులోని గ్యాస్ గోడౌన్ రోడ్డు దారుణంగా ఉంది. దీనితో రహదారులన్నీ అధికారుల అలసత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా మారాయి. ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు రైతులు తమ నిత్య కార్యకలాపాల సాగించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు కనీసం రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.


గుండుగొలను జగనన్న కాలనీలోని ప్రధాన రోడ్డు దుస్థితి


భీమడోలులో గ్యాస్ గోడౌన్ రోడ్డుపై వర్షాలకు ఏర్పడిన భారీ గొయ్యి


గుండుగొలను నుంచి భోగాపురం వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు